# వివాహ వాగ్దానం మరియు వివాహ క్రమం

ఆదిలాబాద్ గురుపీఠం

మొదటి ముద్రణ : సెప్టెంబర్ 2021
ప్రతులు : 1000

ముద్రణానుమతి : మహా ఘన ప్రిన్స్ అంతోని తండ్రి గారు
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు

***

ఆదిలాబాద్ గురుపీఠ విశ్వాసుల ఉపయోగార్థమై
ఈ ప్రార్థన పుస్తకము ముద్రించబడినది

**ప్రతులకు సంప్రదించండి**

జీవస్వరం
బిషప్స్ హౌస్
మంచిర్యాల- 504 208
జిల్లా: మంచిర్యాల, తెలంగాణ
ఫోన్ : 9398764408

Jeevaswaram
Bishop's House
Mancherial - 504 208
Dist. Mancherial, T.S.
Cell : 9398764408

# వివాహ వాగ్దానం

(గురువు పవిత్ర వస్త్రములను ధరించి వచన వేదికను చేరుదురు. వివాహ వాగ్దానం చేయువారు మరియు సాక్షులు వచన వేదికకు ముందు నిలబడుదురు. ఉంగరములు, పవిత్ర జలమును ప్రత్యేకముగా తయారు చేయబడిన పీఠముపై ఉంచుదురు)

గురువు : మహోన్నత స్థలములో దేవునికి మహిమ (3)

అందరు : ఆమెన్ (3)

గురువు : భూలోకములో మానవులకు శాంతి, ఆశాభావము సదా కలుగును గాక.

అందరు : ఆమెన్.

గురువు : పరలోకమందున్న మా తండ్రీ,

(అందరు) మీ నామము పూజింపబడునుగాక. మీ రాజ్యము వచ్చును గాక. మీరు పరిశుద్ధులు, పరిశుద్ధులు, పరిశుద్ధులు. పరలోకమందున్న మా తండ్రీ, పరలోక భూలోకములు మీ మహిమతో నిండి యున్నవి. మీరు పరిశుద్ధులు, పరిశుద్ధులు, పరిశుద్ధులు అని దేవదూతలు, మానవులు స్తుతించుచున్నారు. పరలోకమందున్న మా తండ్రీ, మీ నామము పూజింపబడును గాక. మీ రాజ్యము వచ్చునుగాక, మీ చిత్తము పరలోకమందు నెరవేరునట్లు భూలోకమందును నెరవేరునుగాక. నానాటికి కావలసిన మా అన్నము, మాకు నేటికివ్వండి. మా వద్ద అప్పు బడినవారిని మేము మన్నించునట్లు, మా అప్పులను మీరు మన్నించండి. మమ్ము శోధన యందు ప్రవేశింపనీయక, కీడులో నుండి మమ్ము రక్షించండి. ఏలయన నిరంతరము మీదే రాజ్యము, మీదే అధికారము, మీదే మహిమ, ఆమెన్.

గురువు : పిత, పుత్ర, పవిత్రాత్మలకు మహిమ కలుగును గాక

అందరు : ఆదిలోవలె అంత్యము వరకు ఆమెన్.

గురువు : పరలోకమందున్న మా తండ్రీ

(అందరు) మీ నామము పూజింపబడును గాక. మీ రాజ్యము వచ్చునుగాక. మీరు పరిశుద్ధులు, పరిశుద్ధులు, పరిశుద్ధులు. పరలోకమందున్న మా తండ్రీ, పరలోక భూలోకములు మీ మహిమతో నిండియున్నవి. మీరు పరిశుద్ధులు, పరిశుద్ధులు, పరిశుద్ధులు అని దేవదూతలు, మానవులు స్తుతించుచున్నారు.

పరిచార : ప్రార్థించుదము సమాధానము మనతో ఉండును గాక.

గురువు : మా ప్రభువైన దేవా, ఆదిలో మానవుని స్త్రీ పురుషులుగా సృష్టించి ప్రేమైక్యత కొరకు మరియు మానవజాతి అభివృద్ధి కొరకు వారిని ఒకటిగా చేసిన మిమ్ము మేము స్తుతించుచున్నాము. పూర్వపితరుడైన ఈసాకును, అతని జీవిత భాగస్వామిగా ఎన్నుకోబడిన రిబ్కాను అనుగ్రహించిన ప్రభువా, వివాహ వాగ్దానం కొరకు మీ సన్నిధిలో నిలుచున్న ఈ దాసులు (పేర్లు) స్వతంత్ర మనసుతో, పరిపూర్ణ సంతోషముతో వివాహ వాగ్దానం చేయుటకు అనుగ్రహించండి. సదా పితా, పుత్ర, పవిత్రాత్మయైన సర్వేశ్వరా.

అందరు : ఆమెన్.

## కీర్తన 34,8-14

గురువు : పరిశీలించి చూడుడు. ప్రభువెంత మంచి వాడో మీకే తెలియును. అతని శరణు వేడువాడు ధన్యుడు.

(కానోన) ఈసాకుకు భార్యను వెదకుటకు మార్గమును సిద్ధపరచిన దేవా, వివాహ వాగ్దానం కొరకు వచ్చిన ఈ మీ దాసులను అనుగ్రహించండి.

అందరు : భక్తిమంతులారా! మీరు ప్రభువునకు భయపడుడు. అతనికి భయపడు వారికి ఏ కొదువయు వాటిల్లదు.

గురువు : సింహపు పిల్లలు ఆహారము దొరకక అలమటించును. కాని ప్రభువును ఆశ్రయించు వారికి సకల మేలులు సిద్ధించును.

అందరు: తనయులారా రండు, నా ఉపదేశమును ఆలింపుడు! నేను మీకు దైవభీతిని నేర్పింతును.

గురువు : మీరు బ్రతుకగోరినచో, దీర్ఘకాలము జీవించుటకు శుభములు పొంద గోరినచో చెడ్డ మాటలు పలుకకుడు, అబద్ధములు ఆడకుడు.

అందరు: చెడు నుండి వైదొలగి మంచిని చేపట్టుడు. శాంతిని కాంక్షించి దానిని సాధించుటకు పూనుకొనుడు.

గురువు : పిత, పుత్ర, పవిత్రాత్మలకు మహిమ కలుగును గాక!

అందరు: ఆదిలోవలె అంత్యము వరకు ఆమెన్.

పరిచార: ప్రార్థించుదము సమాధానము మనతో ఉండును గాక.

గురువు : మా ప్రభువైన దేవా, మీ ప్రేమ పరిమళము మమ్మావరించి, మీ సత్యజ్ఞానముతో మా ఆత్మలను ప్రకాశింప చేయగా పరలోకము నుండి ప్రత్యక్షమగు మీ దివ్య కుమారుని స్వీకరింప మమ్ము అనుగ్రహించండి. సకల సౌభాగ్యములతో, మేలులతో అలంకరింప బడిన శ్రీసభలో నిత్యము మిమ్ము స్తుతించి మహిమపరచ మమ్ము యోగ్యులను చేయండి. ఏలయన మీరు సకలమునకు సృష్టికర్తయై యున్నారు. సదా సకలమునకు నాథా.

అందరు: ఆమెన్

సకలమునకు ప్రభుదేవా
మేము మిమ్ము స్తుతించెదము
యేసు నాథా వినయముతో
ఆరాధించి పొగడెదము

మా దేహములకు ఉత్థానం
మా ఆత్మలకు నవజీవం
ఒసగే ప్రభువా ధన్యుడవు
ఆరాధించి పొగెడదము

లేక

అందరు : సకలమునకు ప్రభువా, మిమ్ము మేము స్తుతించు చున్నాము. యేసు క్రీస్తువా, మిమ్ము మేము మహిమ పరుచు చున్నాము. ఏలయన, మీరు మా శరీరములను జీవముతో లేపు వారును, ఆత్మలను రక్షించువారునై యున్నారు.

పరిచార : ప్రార్థించుదము సమాధానము మనతో ఉండును గాక.

గురువు : నా ప్రభువా, నిజముగా మీరు మా శరీరములను లేపువారును, ఆత్మలను రక్షించు వారును, జీవమును నిత్యము పాలించు వారునైయున్నారు. మీకు నిరంతరము కృతజ్ఞత, ఆరాధన, స్తుతులు చెల్లించుట మా కర్తవ్యము, సదా సకలమునకు నాథా.

అందరు: ఆమెన్.

పరిచార : గళములెత్తి పాడుదము
కలిసి మనము పాడుదము
అనవరతం జీవించు
సర్వేశ్వరుని స్తుతియించెదము

అందరు: పరిశుద్ధుడైన ప్రభుదేవా
పరిశుద్ధుడైన బలవంతుడా
పరిశుద్ధుడైన అమరుండా
మాపై దయగా నుండండి

లేక

పరిచార : సహోదరీ సహోదరులారా ! గళమెత్తి
మీరు సజీవుడైన దేవుని కీర్తించండి.

అందరు : పరిశుద్ధుడైన దేవా, పరిశుద్ధుడైన బలవంతుడా, పరిశుద్ధుడైన అమరుడా, మాపై దయచూపండి.

పరిచార : ప్రార్థించుదము సమాధానము మనతో ఉండును గాక.

గురువు : మా ప్రభువైన దేవా, జీవదాయకమును, దైవీకమునైన మీ దివ్య సందేశము నాలకించి గ్రహించుటకు, మా బుద్ధిని ప్రకాశింప జేయండి. ఆత్మ శరీరములకవసరమగు ప్రేమ, ఆశాభావము, రక్షణ మాలో ఫలించుటకును నిరంతరము మేము మిమ్ము స్తుతించుటకును మీ కారుణ్యానుగ్రహములచే మాకు తోడ్పడండి. సదా పిత, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా.

అందరు: ఆమెన్.

## సువిశేషగీతం

యేసు దేవుని వచనం
తిరువచనం సంలిఖితం
శ్రీ యేసు దేవుని శుభ వచనం
పరిశుద్ధాత్మ నివేశంతో
యూదయా సభలో మత్తాయి
రోమీయులకు మార్కును
ఐగుప్తీయులకు లూకాయు
ఎఫెసీయులకు యోహాను
వ్రాసిరిగా హల్లేలూయ
తరతరముల్ పఠించునుగా
సాదరమీ తిరు గ్రంథం
ప్రభు మహిమలను అనవరతం
మహిలో పాడి పొగడెదము

పరిచార: మనమందరము భక్తి శ్రద్ధలతో పవిత్ర సువిశేషమును ఆలకించెదము.

గురువు : సమాధానము + మీతో ఉండును గాక.

అందరు: మీతోను మీ ఆత్మతోను ఉండును గాక.

గురువు : పునీత...ప్రకటించిన మన ప్రభువైన యేసు క్రీస్తు పవిత్ర సువిశేషము

## సువిశేషము

## యోహాను 15, 9-12 (లేదా) మత్తయి 6, 25-33

## సువిశేష పఠనానంతరము

అందరు: మన ప్రభువైన క్రీస్తునకు స్తుతి స్తోత్రములు.

## ప్రసంగం

## వేడుదల

పరిచార: మనమందరం సంతోషముతోను, భక్తితోను వివాహ వాగ్దానము కొరకు సిద్ధపడిన ఈ దాసులపై దయ చూపండి అని ప్రార్థిద్దాం

అందరు: ప్రభువా, ఈ దాసులపై దయచూపండి.

పరిచార: వివాహ వాగ్దానం చేస్తున్న వీరిని ఆశీర్వదించి, వీరు చేసే వాగ్దానమును అనుసరించి వివాహితులగుటకు వీరిని అనుగ్రహించుమని మిమ్ము మేము ప్రార్థించుచున్నాము.

అందరు: ప్రభువా, ఈ దాసులపై దయచూపండి.

పరిచార: క్రైస్తవ విశ్వాసము మరియు హృదయ పరిశుద్ధత కలిగిన వివాహ జీవితమును జీవించుటకు వీరిని సిద్ధపరచుమని మిమ్ము మేము ప్రార్థించుచున్నాము.

అందరు: ప్రభువా, ఈ దాసులపై దయ చూపండి.

పరిచార: క్రైస్తవ కుటుంబ బాధ్యతను అర్థం చేసుకొని వివాహ జీవితములోనికి ప్రవేశించుటకు వీరిని అనుగ్రహించుమని మిమ్ము మేము ప్రార్థించుచున్నాము.

అందరు: ప్రభువా, ఈ దాసులపై దయచూపండి.

పరిచార: వివాహమనే దివ్య సంస్కారం పరస్పరం వధూవరుల మధ్యలో మరియు దేవునితో చేసే ఒడంబడిక అని, మరణం వరకు నిలిచే బంధం అని గ్రహించి వివాహ సంస్కారమును స్వీకరించుటకు వీరిని సిద్ధపరచమని మిమ్ము మేము ప్రార్థించుచున్నాము.

అందరు: ప్రభువా, ఈ దాసులపై దయ చూపండి.

పరిచార: పిత, పుత్ర, పవిత్రాత్మలకు మనలను సమర్పించు కొందము.

అందరు: మా దేవుడైన ప్రభువా, మీకు మమ్ము సమర్పించు కొనుచున్నాము.

గురువు : మా ప్రభువైనా దేవా, వివాహ వాగ్దానం చేయుటకు మీ సన్నిధిలో నిలిచియున్న ఈ దాసులను అనుగ్రహించండి. వారు చేస్తున్న వాగ్దానమును పూర్తిచేయుటకు, మీకు ప్రీతికరమైన జీవితం జీవించుటకు కావలసిన అనుగ్రహం వీరికి దయ చేయండి. వీరిని, వీరి కుటుంబ సభ్యులను ప్రేమైక్యతలో సంరక్షించండి. సదా పిత, పుత్ర, పవిత్రాత్మతయైన సర్వేశ్వరా.

అందరు: ఆమెన్.

గురువు : (పేర్లు) స్వతంత్ర మనస్సుతో, సరియైన అవగాహనతో, పూర్ణ సమ్మతితో మాత్రమే వివాహ వాగ్దానము చేయాలని మీకు తెలుసు గదా! మీ ఈ వివాహ వాగ్దానమును బహిరంగంగా ప్రకటించుటకు తల్లి శ్రీసభ మీకు అవకాశం కల్పిస్తుంది.

గురువు : (వరుని పేరు) క్రీస్తు నియమమును శ్రీసభ కట్టడలను అనుసరించి వివాహమనే దివ్య సంస్కారం ద్వారా (వధువు పేరు)ను నీ భార్యగా స్వీకరించెదవని వాగ్దానం చేయుచున్నావా?

వరుడు : వాగ్దానం చేయుచున్నాను.

గురువు : (వధువు పేరు) క్రీస్తు నియమములను శ్రీసభ కట్టడలను అనుసరించి వివాహమనే దివ్య సంస్కారం ద్వారా (వరుని పేరు)ను నీ భర్తగా స్వీకరించెదవని వాగ్దానం చేయుచున్నావా?

వధువు : వాగ్దానం చేయుచున్నాను.

గురువు : (సాక్షులతో) మీరు ఈ వివాహ వాగ్దానమునకు సాక్షులుగా ఉన్నారా?

సాక్షులు : ఉన్నాము.

గురువు : వివాహ వాగ్దానం చేసిన (పేర్లు)ను క్రీస్తు అనుగ్రహించి, ఆశీర్వదించి ఈ వాగ్దానం నెరవేర్చుటకు తోడ్పడును గాక.

అందరు: ఆమెన్.

(గురువు పవిత్ర జలం చల్లును)

గురువు : ప్రభువైన క్రీస్తువా! శ్రీసభను పరిశుద్ధ వధువుగా స్వీకరించిన మీరు, వివాహ వాగ్దానం చేసిన ఈ దాసులపై కరుణాపూరితమైన మీ కుడి హస్తమును చాపండి. మా తల్లియైన పరిశుద్ధ కన్యమరియమ్మ, తిరుకుటుంబ పాలకుడైన పునీత యోసేపు, మా విశ్వాసమునకు తండ్రియైన పునీత తోమాసు గార్ల ప్రార్థనలు వీరి వాగ్దానమును సఫలం చేయునుగాక. సకల పునీతుల, ప్రత్యేకంగా మా శ్రీ సభలోని పునీతుల, ధన్యుల మధ్యవర్తిత్వం వీరికి సంరక్షణను, సహాయమును దయచేయును గాక. సదా సకలమునకు నాథా.

అందరు: ఆమెన్, ప్రభువా ఆశీర్వదించండి.

## సమాపన ఆశీర్వాదం

గురువు : దేవుని పరిపాలనలో మీరు చేసిన వివాహ వాగ్దానమును ఆయన తన వాక్కుతో బలపరచి, ప్రేమ ఆజ్ఞతో సుస్థిరపరచి, కరుణతో పూర్తిచేయునుగాక. అబ్రహామును సారాను, ఈసాకును రిబ్కాను, యాకోబును రాహేలును జతపరచిన దేవుడు మీ వాగ్దానమును విశ్వాసములో, సత్యములో, ప్రేమలో, మానసిక ఐక్యతలో ముద్రించునుగాక. ధృడమైన ప్రార్ధనతో, ఆధ్యాత్మిక సిద్ధపాటుతో వివాహమనే దివ్య సంస్కారమును స్వీకరించుటకు దేవుడు మిమ్ములను బలపరచునుగాక. మిమ్ములను, మిమ్ములను ప్రేమతో పెంచిన తల్లిదండ్రులను, మీ కుటుంబ సభ్యులను, ఈ పరిశుద్ధ పరిచర్యలో పాల్గొనిన అందరిని దేవుడు సమృద్ధిగా దీవించును గాక. ఇప్పుడును, ఎప్పుడును, + ఎల్లప్పుడును.

అందరు: ఆమెన్.



# వివాహము

(వధూవరులు బంధుమిత్రులతో కలిసి ముఖద్వారము గుండా, దేవాలయములోనికి ప్రవేశించి, వచన వేదికను సమీపించెదరు. గురువు దివ్య వస్త్రములు ధరించి పరిచారకులతో ప్రదక్షిణముగా వచన వేదికను సమీపించుచుండగా ప్రారంభ గీతం ఆలపించెదరు.)

గురువు : పాస్కా పండుగ నాడు
ప్రభువు ఇచ్చిన ఆజ్ఞ ఇదే
తిరునామమున చేరుదము
ఏకమై ఈ బలి అర్పింతము

అందరు : ఏక మనస్కులమై మనము
నూతన పీఠము నిర్మింతము
ప్రభుని ప్రేమలో ఈ యాగం
తిరుసన్నిధిలో అర్పింతము.

గురువు : మహోన్నత స్థలమున దేవునికి మహిమ (3)

గురువు : భూలోకవాసులకు శాంతి సమాధానం (3)

గురువు : పరలోకమందున్న మా తండ్రీ
మీ నామం పూజితమగుగాక
మీ రాజ్యం ఇలలో రావాలి
మీరే పరిశుద్ధుల్ పరిశుద్ధుల్

అందరు : పరలోకమందున్న మా తండ్రీ
స్తుతియింప తగును మీ మహిమ
ఇహపరములలో నిండి సదా
పరిపావనమై వెలుగొందును

దేవుని దూతల బృందాలు
ఆనందముతో చాటుదురు
పరిశుద్ధుల్ నిత్యం పరిశుద్ధుల్
మీరే పరిశుద్ధుల్, పరిశుద్ధుల్

పరలోకమందున్న మా తండ్రీ
మీనామం పూజితమగుగాక
మీరాజ్యం ఇలలో రావాలి
మీ చిత్తము నెరవేరుగా
స్వర్గములో వలె భువిలోను
మీ చిత్తం నెరవేరుగా
మాకు కావలసిన అన్నం
మాకు నేటికి దయచేయుము
మా వద్ద అప్పు బడిన వారిని
మేము క్షమియించు నట్లునే
మా తప్పులను మన్నించి
పాపరుణాలను తీర్చండి
శోధనలో మేమెన్నడు
ప్రవేశింపక కాపాడు
కీడుల నుండి రక్షించు
నిరతము మమ్ము పాలించు
ఏలయన కలకాలము
రాజ్యము శక్తియు మహిమయును
మీకే చెందును ఓ దేవా
ఆమెన్ ఆమెన్ అనవరతం

గురువు : పితకును వోలె సుతునకును
పరిశుద్ధాత్మకు స్తుతి మహిమ
ఆది అనాది అంత్యము వరకు
ఆమెన్ ఆమెన్ అనవరతం

అందరు : పరలోకమందున్న మా తండ్రీ
మీ నామం పూజిత మగుగాక
మీ రాజ్యమిలలో రావాలి
మీరే పరిశుద్ధుల్ పరిశుద్ధుల్

పరలోకమందున్న మా తండ్రీ
స్తుతియింపతగును మీ మహిమ
ఇహపరములలో నిండి సదా
పరిపావనమై వెల్గొందును
దేవుని దూతల బృందాలు
ఆనందముతో చాటుదురు
పరిశుద్ధుల్ నిత్యం పరిశుద్ధుల్
మీరే పరిశుద్ధుల్, పరిశుద్ధుల్

పరిచార : ప్రార్థించుదము సమాధానము మనతో ఉండును గాక.

గురువు : ప్రభువైన దేవా, వివాహ సంస్కారము ద్వారా బంధితులై హృదయైక్యములో జీవింప మీరు ఈ దాసులను ఆహ్వానించియున్నారు. స్వర్గీయ వరములతో ఈ వధూవరులను సంపన్నులను చేసి, మీ ఆజ్ఞలను అనుసరించి ఆదర్శవంతమైన కుటుంబమును రూపొందింప వీరికి తోడ్పడండి. మీ మహిమార్థము మరియు సకల మానవాళి ప్రయోజనార్థము ఈ సంస్కారమును యోగ్యముగా నిర్వహించుటకు మమ్ము శక్తిమంతులనుగా చేయండి. సదా పిత, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా.

అందరు : ఆమెన్.

## కీర్తన 45,128

గురువు : కుమారీ, నీవు నా పలుకులు సావధానముగా వినుము.
నీ ప్రజలను, పుట్టినింటిని ఇక మరచి పొమ్ము.

(కానోన) మా రక్షకుని వధువైన శ్రీసభ, ఆనందించుము.
నిత్యుడైన దేవుడు తన ప్రేమతో నిన్ను వధువుగా
ఎన్నుకొనియున్నాడు.

అందరు : రాజకుమారి సౌందర్యము అంతరంగికమైనది.
ఆమె వస్త్రములను పసిడి పోగులతో నేసిరి.

గురువు : విలువైన కానుకలతో ఆమె రాజును దర్శించును. ఆమె చెలికత్తెలు ఆమెను అనుసరింతురు.

అందరు : వారెల్లరు ఆనందోత్సాహములతో కదలివచ్చి రాచ నగరమును ప్రవేశింతురు. సమస్త తరముల వారు ఆయన నామమును స్మరింతురు.

గురువు : నీ లోగిట నీ భార్య ఫలించు ద్రాక్షాతీగ వలె నుండును. నీ భోజనపు బల్ల చుట్టు నీ పిల్లలు ఒలీవు మొక్కలవలె ఉందురు.

అందరు : ప్రభువు నందు భయభక్తులు కలవాడు ఆశీర్వదింప బడును. ప్రభువు సీయోను నుండి నీ జీవిత కాలమందెల్ల నిన్ను ఆశీర్వదించును.

గురువు : పిత, పుత్ర, పవిత్రాత్మలకు మహిమ కలుగును గాక.

అందరు : ఆదిలో వలె అంత్యము వరకు, ఆమెన్.

గురువు : మా రక్షకుని వధువైన శ్రీసభ, ఆనందించుము. నిత్యుడైన దేవుడు తన ప్రేమతో నిన్ను వధువుగా ఎన్నుకొనియున్నాడు..

(పరిచారకుడు ధూపకలశము, పరిమళ ద్రవ్యమును తీసుకొని వచ్చును, గురువు ధూపకలశములో పరిమళ ద్రవ్యము వేసి నెమ్మదిగా క్రింది విధమున ప్రార్థింతురు.)

గురువు : పిత, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా, మీ గౌరవార్థము మేము అర్పించు ఈ ధూపము మీ మహిమాన్విత త్రిత్వము యొక్క నామమున +ఆశీర్వదింపబడును గాక. ఇది మీ సంప్రీతికి పాత్రమై మీ ఆరాధకుల పాపవిమోచనమునకు సదా కారణమగును గాక.

అందరు : ఆమెన్

పరిచార : సమాధానము మనతో ఉండును గాక.

గురువు : మా ప్రభువైన దేవా, మీ ప్రేమ పరిమళము మమ్మావరించి, మీ సత్యజ్ఞానముతో మా ఆత్మలను ప్రకాశింప చేయగా పరలోకమునుండి ప్రత్యక్షమగు మీ దివ్య కుమారుని స్వీకరింప మమ్ము అనుగ్రహించండి. సకల సౌభాగ్యములతో మేలులతో అలంకరింపబడిన శ్రీసభలో నిత్యము మిమ్ము స్తుతించి, మహిమపరచ మమ్ము యోగ్యులను చేయండి. ఏలయన మీరు సకలమునకు సృష్టికర్తయై యున్నారు. సదా సకలమునకు నాథా.

అందరు : ఆమెన్.

(గురువు దీపమును వెలిగించును)

గురువు : లోకమునకు వెలుగును నేనే. నన్ను అనుసరించు వాడు అంధకారమున నడువక, జీవపు వెలుగును పొందును అని పలికిన క్రీస్తు మనకు మార్గదీపమగును గాక.

సకలమునకు ప్రభుదేవా
మేము మిమ్ము స్తుతించెదము
యేసు నాథా వినయముతో
ఆరాధించి పొగడెదము

మా దేహములకు ఉత్థానం
మా ఆత్మలకు నవజీవం
ఒసగే ప్రభువా ధన్యుడవు
ఆరాధించి పొగడెదము

లేక

అందరు : సకలమునకు ప్రభువా, మిమ్ము మేము స్తుతించు చున్నాము. యేసు క్రీస్తువా, మిమ్ము మేము మహిమ పరుచు చున్నాము. ఏలయన, మీరు మా శరీరములను జీవముతో లేపు వారును, ఆత్మలను రక్షించువారునై యున్నారు.

పరిచార : ప్రార్థించుదము సమాధానము మనతో నుండును గాక.

గురువు : నా ప్రభువా, నిజముగా మీరు మా శరీరములను లేపువారును, ఆత్మలను రక్షించు వారును, జీవమును నిత్యము పాలించు వారునై యున్నారు. మీకు నిరంతరము కృతజ్ఞత, ఆరాధన, స్తుతులు చెల్లించుట మా కర్తవ్యము, సదా సకలమునకు నాథా.

అందరు : ఆమెన్.

పరిచార : గళములెత్తి పాడుదము
కలసి మనము పాడుదము
అనవరతం జీవించు
సర్వేశ్వరుని స్తుతియించెదము

అందరు : పరిశుద్ధుడైన ప్రభుదేవా
పరిశుద్ధుడైన బలవంతుడా
పరిశుద్ధుడైన అమరుండా
మాపై దయగా నుండండి

లేక

పరిచార : సహోదరీ సహోదరులారా ! గళమెత్తి
మీరు సజీవుడైన దేవుని కీర్తించండి.

అందరు : పరిశుద్ధుడైన దేవా, పరిశుద్ధుడైన బలవంతుడా,
పరిశుద్ధుడైన అమరుడా, మాపై దయచూపండి.

పరిచార : ప్రార్థించుదము సమాధానము మనతో నుండును గాక.

గురువు : పరిశుద్ధుడు, స్తుతి పాత్రుడు, బలవంతుడు, అమరుడవునైన ప్రభువా, పరిశుద్ధులలో ప్రీతివంతుడై నివసించు మీరు, మీ స్వభావమునకు అనుగుణముగా మమ్ము కటాక్షించి, అనుగ్రహించి, మాపై కరుణ చూపండి. సదా పిత, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా.

అందరు : ఆమెన్.

**మొదటి పఠనము**

**ఆదికాండము 1:26-28 లేక ఆదికాండము 2:18-24**

**రెండవ పఠనము**

**యెషయా గ్రంథము 61,10-11 లేక జ్ఞాన గ్రంథము 26:1-4,13-17**

గురువు : సకల చరాచరము
దైవమహిమలను
పొగడి పాడును
అత్మతో జనించు గీతములు
హల్లేలూయ గీతములు
యేసు ప్రభుని ఉత్థాన పండుగ
నిర్మలమైన వేడుకలు
కొనియాడున్ నేడీ వేదికలో

పరిచార : భూమ్యాకాశములు
ప్రభు ఘన మహిమలతో
మారు మ్రోగెను

అందరు : అత్మతో జనించు....................

పరిచార : జనములు ఆ ప్రభుని
మహిమను పాడెదరు
ప్రణమిల్లి మ్రొక్కెదరు

అందరు : అత్మతో జనించు.......................

గురువు : నిత్యుండయిన పిత
సుత పరిశుద్ధాత్మకు
స్తుతి కలుగును గాక

అందరు : అత్మతో జనించు.......................

పరిచార : ఆదిలో ఉన్నట్లు
ఇప్పుడు ఎల్లప్పుడు
అనవరతం ఆమెన్

అందరు : అత్మతో జనించు.......................

పరిచార : ప్రార్థించుదము, సమాధానము మనతో నుండును గాక.

గురువు : మా ప్రభువైన దేవా, జీవదాయకమును దైవీకమునైన మీ దివ్య సందేశమును ఆలకించి గ్రహించుటకు, మా బుద్ధిని ప్రకాశింప చేయండి. ఆత్మ శరీరములకు అవసరమగు ప్రేమ, ఆశాభావము, రక్షణ మాలో ఫలించుటకును, నిరంతరం మేము మిమ్ము స్తుతించుటకును మీ కారుణ్యానుగ్రహములచే మాకు తోడ్పడండి. సదా పిత, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా

అందరు : ఆమెన్

## మూడవ పఠనము

## ఎఫేస్సీ 5: 20-33 లేక 1 పేతురు 3:1-7

## సువిశేషగీతం

యేసు దేవుని వచనం
తిరువచనం సంలిఖితం
శ్రీ యేసు దేవుని శుభ వచనం
పరిశుద్ధాత్మ నివేశంతో
యూదయా సభలో మత్తాయి
రోమీయులకు మార్కును
ఐగుప్తీయులకు లూకాయు
ఎఫెసీయులకు యోహాను
వ్రాసిరిగా హల్లేలూయ
తరతరముల్ పఠించునుగా
సాదరమీ తిరు గ్రంథం
ప్రభు మహిమలను అనవరతం
మహిలో పాడి పొగడెదము.

పరిచార : మనమందరము భక్తి శ్రద్ధలతో పవిత్ర సువిశేషమును ఆలకించెదము.

గురువు : సమాధానము + మీతో ఉండును గాక.

అందరు : మీతోను మీ ఆత్మతోను ఉండును గాక.

గురువు : పునీత........ ప్రకటించిన మన ప్రభువైన యేసు క్రీస్తు పవిత్ర సువిశేషము

అందరు : మన ప్రభువైన క్రీస్తునకు స్తుతి స్తోత్రములు.

**సువిశేషము**

**యోహాను 2, 1-11 (లేదా) మార్కు 10, 2-9**

**ప్రసంగం**

**వేడుదల**

పరిచార : మనమందరము సంతోషముతోను, భక్తితోను వివాహ సంస్కారము ద్వారా బంధితులు కాబోతున్న ఈ వధూవరుల కొరకు ఈ విధమున ప్రార్థించుదము. "ప్రభువా, ఈ వధూవరులపై దయ చూపండి."

అందరు : ప్రభువా ఈ వధూవరులపై దయ చూపండి

పరిచార : మీ వధువైన శ్రీసభ కొరకు ప్రాణమునర్పించిన స్వర్గీయ నాథా, పరస్పర ప్రేమలో ఐక్యములో త్యాగ పూరిత జీవితం గడుపుటకు వీరిపై దయచూపండి

అందరు : ప్రభువా ఈ వధూవరులపై దయ చూపండి

పరిచార : దైవ వాక్కు అనే ఆధ్యాత్మిక విందుకు, సమస్త జనులను ఆహ్వానించుచున్న క్రీస్తువా, మీ ఆజ్ఞలననుసరించి, ఆదర్శవంత కుటుంబముగా జీవించి, పరలోక విందులో పాల్గొనుటకు వీరిపై దయచూపండి.

అందరు : ప్రభువా ఈ వధూవరులపై దయ చూపండి

పరిచార : వివాహ బంధము విడదీయరానిదని బోధించిన క్రీస్తువా, పరస్పర విశ్వాసముతో, పాతివ్రత్యముతో అనందభరిత దాంపత్యమును జీవించుటకు వీరిపై దయ చూపండి.

అందరు : ప్రభువా ఈ వధూవరులపై దయ చూపండి

పరిచార : కానాపల్లె వివాహ విందులో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన ప్రభువా, మిమ్ము ఆశ్రయించి, మీ సాన్నిధ్యమును అనుభవించి, ప్రార్థనా నిరతులై జీవించుటకు వీరిపై దయచూపండి.

పరిచార : పిత, పుత్ర, పవిత్రాత్మలకు మనలను సమర్పించుకొందము.

అందరు : మా దేవుడైన ప్రభువా, మీకు మమ్ము సమర్పించుకొనుచున్నాము.

గురువు : మా ప్రభువైన దేవా, సంతోషముతో, ఆశాపూర్వక నిరీక్షణతో ఈ వధూవరులు ప్రారంభించు కుటుంబ జీవితము ఫలవంతమగునట్లు వీరిని అనుగ్రహించండి. మీ శాంతి సమాధానములతో వీరిని పరిపూర్ణులను చేసి, మీ దాసులకు మీరు వాగ్దానము చేసిన నిత్య కీరిటము సాధింప వీరిని అర్హులను చేయండి. మీ ప్రేమలో వీరిని పెంచిన తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను ఈ దివ్య పరిచర్యలో పాల్గొను మమ్మందరిని ఆశీర్వదించండి. సదా, పిత, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా

అందరు : ఆమెన్

పరిచార : ప్రియ సహోదరులారా, వివాహ సంస్కారము ద్వారా ఈ వధూవరులు బంధితులు కాబోతున్నారు. ఈ సంస్కారమును యోగ్యముగా నిర్వహించుటకు గురువు

తన కొరకై తాను ఈ సమయంలో ప్రార్థింప బోవుచున్నారు. మనమందరము భక్తి శ్రద్ధలతో నిశ్శబ్దముగా ప్రార్థించుదము.

గురువు : ఆదిలో నరునికి జీవిత సఖిని అనుగ్రహించిన దేవా, మీ అనంత పరిపాలనను మేము స్తుతించుచున్నాము. భార్యా భర్తలగుటకు ఆశించు వీరిని ప్రేమతో బంధించు ఈ సంస్కారమును యోగ్యముగా నిర్వహించుటకు ఈ మీ దాసుని శక్తిమంతునిగా చేయండి. మీ కృపావరములను నాపై సమృద్ధిగా వర్షించండి. సదా, పిత, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా

అందరు : ఆమెన్

## వివాహ ఒడంబడిక

గురువు : (వరుని పేరు పిలుచుచు) క్రీస్తు నియమమును శ్రీసభ కట్టడను అనుసరించి, స్వతంత్ర మనస్సుతోను పూర్ణ సమ్మతితోను (వధువు పేరు) ను నీ భార్యగా స్వీకరించుచున్నావా?

వరుడు : నేను స్వీకరించుచున్నాను.

గురువు : (వధువు పేరు పిలుచుచు) క్రీస్తు నియమమును శ్రీసభ కట్టడను అనుసరించి, స్వతంత్ర మనస్సుతోను పూర్ణ సమ్మతితోను (వరుని పేరు) ను నీ భర్తగా స్వీకరించుచున్నావా?

వధువు : నేను స్వీకరించుచున్నాను.

గురువు : (సాక్షులతో) మీరు ఈ వివాహ ఒడంబడికకు సాక్షులుగా ఉన్నారా?

సాక్షులు : ఉన్నాము

గురువు : (వధూవరులతో) వివాహ ఒడంబడికకు గుర్తుగా, పరస్పరము మీ కుడిచేతులను పట్టుకొనండి.

వధూవరులు పరస్పరము చేతులు పట్టుకొనగా

గురువు క్రింది విధమున ప్రార్థించుచు ఆశీర్వదింతురు

**గురువు :** అబ్రహాము, ఈసాకు, యాకోబుల దేవుడు మీతో ఉండును గాక. ప్రేమ పూర్వకముగా, హృదయైక్యముతో, కుటుంబ జీవితము జీవించుటకు మన ప్రభువైన యేసు క్రీస్తు, మిమ్ము వివాహ సంస్కారము ద్వారా బంధింప చేయును గాక. సదా పిత, పుత్ర, పవిత్రాత్మ + నామమున

**అందరు :** ఆమెన్

(గురువు వధూవురుల కుడి చేతులపై పవిత్ర జలము చల్లుదురు)

## తాళి ఆశీర్వాదం

**గురువు :** సిలువ మరణము ద్వారా శ్రీసభను వధువుగా స్వీకరించిన ప్రభువా, ప్రేమ, విశ్వాసముల యందు వధూవరులను ఏకము చేయు ఈ తాళిని + దయతో ఆశీర్వదించండి. ఐక్యమునకు చిహ్నమైన ఈ తాళి విడదీయరాని ప్రేమలో, సంపూర్ణ విశ్వాసములో వీరిని బంధించునుగాక. జీవితములో ఎదురయ్యే కష్టములను సంతోష పూర్వకముగా స్వీకరించి జీవించుటకు, తాళియందు ముద్రింపబడిన సిలువ వీరికి శక్తినొసగును గాక. ఈ తాళి వధూవరుల విశ్వాసమునకు సంకేతముగా నుండును గాక.

**అందరు :** ఆమెన్

గురువు తాళిపై పవిత్ర జలమును చల్లుదురు.

## ఉంగరములను ఆశీర్వదించుట

**గురువు :** ప్రభువైన దేవా, ఈ వధూవరుల ప్రేమ, విశ్వాసములకు గుర్తుగా వారు పరస్పరము ధరింపచేయు ఈ ఉంగరములను + ఆశీర్వదించండి. పిత, పుత్ర, పవిత్రాత్మ నామమున.

**అందరు :** ఆమెన్

గురువు ఉంగరములపై పవిత్ర జలమును చల్లుదురు.

## పెళ్లి చీర ఆశీర్వాదము

గురువు : కృపావరమను అనశ్వర వస్త్రముతో, మానవాత్మలను అలంకరించు కరుణామయుడవైన ప్రభువా, ఈ చీరను + ఆశీర్వదించండి. సంపూర్ణ సమర్పణ, పరస్పర ప్రేమ ద్వారా మిమ్ము ధరింప ఈ వధూవరులను ఆశీర్వదించండి. మీ వధువైన పరిశుద్ధ శ్రీసభను మహిమ వస్త్రముతో ధరింప చేసిన ప్రభువా, ఈ లోకములో నిర్మలముగా జీవించుచు పరలోకములో మహిమ వస్త్రములను ధరింప వీరిని అనుగ్రహించండి.

అందరు : ఆమెన్

(గురువు పెళ్లి చీరపై పవిత్ర జలము చల్లుదురు)

వరుడు వధువు మెడలో తాళి కట్టును. వరుడు తాళి కట్టుచుండగా గీతం ఆలపించబడును. ఉంగరములు ఉన్నచో వధూవరులు పరస్పరము ధరింప చేసుకొందురు. గురువు జపమాలలను వధూవరులకిచ్చును. వధూవరులు పూలమాలలు ఒకరి మెడలో ఒకరు వేసికొందురు. గురువు పెళ్ళి చీరను వరునికిచ్చును. వరుడు దానిని వధువునకు అందించును.

(నవదంపతులు పవిత్ర గ్రంథంపై కుడిచేతులుంచి, గురువు వెంట ప్రతిజ్ఞా వాక్యములు పలుకుదురు)

నేటి నుండి మరణము వరకు/ సంతోషములోను, దు:ఖములోను/ సంపదలోను, పేదరికములోను/ ఆరోగ్యములోను అనారోగ్యము లోను/ పరస్పర ప్రేమతో, విశ్వాసముతో/ ఏక మనస్కులమై/ జీవింపగలమని/ పవిత్ర గ్రంథం సాక్షిగా/ మేము వాగ్దానం చేయుచున్నాము./ ఈ వాగ్దానము ననుసరించి జీవింప/ సర్వశక్తిమంతుడైన దేవుడు/ మాకు తోడ్పడును గాక.

అందరు : ఆమెన్

గురువు : (వధూవరులపై చేతులు చాచి) సర్వశక్తిమంతుడైన దేవుడు మిమ్ము దీవించును గాక. అంతరంగిక సౌందర్యముతో, పవిత్రాత్మ వరములతో ఆయన మిమ్ము సంపన్నులను చేయును గాక. శ్రీసభకు శిరస్సైన క్రీస్తు సదా మీకు పరిపాలకునిగా, సంరక్షకునిగా ఉండును గాక. జీవితములోని సకల కార్యములయందు ఆయన మీకు తోడై ఉండును గాక. మానసికమును శారీరకమునైన ఆరోగ్యమును, భౌతిక సుభిక్షతను ఆయన మీకు దయచేయును గాక. దేవుడు మీకు అనుగ్రహించు సంతానములను సంతోషపూర్వకముగా స్వీకరించి, వారిని పవిత్రాత్మ మార్గములో నడిపంప మీకు తోడ్పడును గాక. ఆయనకు స్తుతి, కృతజ్ఞత, ఆరాధనలు సమర్పింప మిమ్ము యోగ్యులను చేయును గాక. ఇప్పుడును, ఎప్పుడును + ఎల్లప్పుడును.

అందరు : ఆమెన్

దివ్యబలి ఉన్న యెడల "ప్రభువును నేను ధృడముగా ఆశ్రయించితిని" అనే గీతముతో దివ్యబలి కొనసాగును.

## సమాపన ప్రార్థనలు

గురువు : మా ప్రభువైన దేవా, ఈ వధూవరులపై మీ కరుణా పూరిత కుడి హస్తమును చాపండి. మీ పరిపాలన నీడలో సదా వీరిని సంరక్షించండి. అబ్రహామును, సారాను దీవించిన దేవా, విడదీయరాని విధంగా వీరిని ఏకం చేసిన మీ పరిపాలనకై మీకు వందనములర్పించుచున్నాము. సదా పిత, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా

అందరు : ఆమెన్, ప్రభువా ఆశీర్వదించండి

గురువు : ప్రభువైన క్రీస్తువా, ఈ వధూవరులను ఆశీర్వదించండి. మన తల్లియైన పరిశుద్ధ కన్య మరియమ్మ, తిరుకుటుంబ పాలకుడైన పునీత యోసేపుల మధ్యవర్తిత్వము వీరి కుటుంబ జీవితమును ఐశ్వర్యవంతము చేయును గాక. సకల పునీతుల ప్రార్థనలు వీరికి తోడగును గాక. సదా సకలమునకు నాథా

అందరు : ఆమెన్

## సమాపన ఆశీర్వాదము

గురువు : అనంత ప్రేమతో, స్త్రీ పురుషులుగా మానవులను సృష్టించి సకల సృష్టికార్యములలో వారిని భాగస్వాములను చేసిన కరుణామయుడైన దేవుడు స్తుతింపబడును గాక. వివాహ సంస్కారము ద్వారా నిష్కళంక ప్రేమలో, నిస్వార్థ ఆత్మసమర్పణలో ఆయన మిమ్ము సంరక్షించును గాక. క్రీస్తు అవయవములును, పవిత్రాత్మ ఆలయములునైన మీ శరీరములను పవిత్రమును, ప్రీతిపాత్రమునైన సజీవ బలిగా దేవునికి సమర్పింప ఈ సంస్కారము మీకు శక్తినొసగును గాక. సంతాన భాగ్యమును ఒసగి దేవుడు మిమ్ము దీవించును గాక. ప్రార్థనలో సహవాసములో మీ కుటుంబము అభివృద్ధి చెందును గాక. మీ జీవితములను ఆయన ఐశ్వర్యవంతము చేసి, మీ ఆశను, నిరీక్షణను సఫలము చేయును గాక. అవసర సమయములయందు ఆదుకొనే నిస్వార్థ మిత్రులను దేవుడు మీకు దయచేయును గాక. స్వర్గములో ఆయనకు స్తుతి, గౌరవము, కృతజ్ఞతలు అర్పింప మీరు యోగ్యులగుదురు గాక. నూతన వధూవరులైన మిమ్ము, ఈ దివ్య పరిచర్యలో పాల్గొనిన అందరిని దేవుడు సమృద్ధిగా దీవించును గాక. ఇప్పుడును, ఎప్పుడును + ఎల్లప్పుడును.

అందరు : ఆమెన్

గురువు : పవిత్రపరచు బలిపీఠమా...